క్లుప్తంగా

శిల్పారామంలో దసరా సందడి



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం దసరా సందడి కనిపించింది. ఈ పండగ సందర్భంగా శిల్పారామంలో ప్రత్యేకంగా మూడు రోజులపాటు నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శనివారం సంప్రదాయ వేదిక చిన్నారుల నృత్యాలతో కనువిందు చేసింది. పులివెందుల ఎస్కే డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భుజంగరావు సేవలు వెలకట్టలేనివి



భుజంగరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్‌జేయూపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ సంస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పసుపులేటి భుజంగరావు అందించిన సేవలు వెలకట్టలేనివని ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. భుజంగరావు జయంతి సందర్భంగా కడప ఆర్జేయూపీ టీచర్స్ హోంలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గునిశెట్టి శ్రీనివాసులుతోపాటు ముత్తోజి వీరబ్రహ్మం, రామకృష్ణారెడ్డి తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి



మాట్లాడుతున్న కేసీ.బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు రాకపోవడంతో దసరా పండగ రోజున పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా పేర్కొన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. స్కావెంజర్స్‌ను కార్మికులుగా గుర్తించాలని కోరారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు ప్రకారం పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగన్న పాల్గొన్నారు.

సాహితీ పరిశోధకుడిగా 'బంగోరె' ప్రత్యేక ముద్ర



బండి గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : సాహితీ పరిశోధకుడిగా బంగోరె పేరుతో బండి గోపాల్‌రెడ్డి ప్రత్యేక ముద్ర సాధించారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో బండి గోపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వేమన, సీపీ బ్రౌన్, గురజాడల సాహిత్య జీవితాలపై లోతైన పరిశోధనలు చేశారని తెలిపారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కల్లూరు బాల యల్లారెడ్డి, సత్యనారాయణ, బాలఓబయ్య పాల్గొన్నారు.

వైభవంగా జగజ్జననీ ఊరేగింపు



దసరా ముగిపు సందర్భంగా దుర్గమ్మ సన్నిధిలో భక్తులు

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. విజయదశమి రోజున అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నగరంలోని ఆలయాల్లో పుష్పతోరణాలు, రంగుల విద్యుద్దీపాలతో చూడ ముచ్చటగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ఊరేగించారు. పది రోజులపాటు పూజలందుకున్న అమ్మవారికి చివరిఘట్టంగా ఈ నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలోని విజయదుర్గాదేవి నగరోత్సవంలో ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పరిటాల వెంకటరమణ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీమాత ఊరేగింపు కొనసాగింది. హనుమప్పవీధి భద్రావతి భావనారుషి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని పెద్దబెస్తవీధిలోని బాల పోలేరమ్మ, నడివీధి



ఊరేగింపులో లక్ష్మీ సత్యనారాయణస్వామి

గంగమ్మ, గడ్డిబజారు సత్యనారాయణస్వామి, కామకోటి కళాంబదేవి, లలిత పంచాయతన ఆలయాల్లో శనివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి వాహనాలపై ఊరేగించారు.



శంకరాపురం ఎస్‌బీఐ వెనుక వీధిలో నగరోత్సవం

జమ్మి దర్శనం

సాయంత్రం మూడు గంటల నుంచి అమ్మవారి ఆలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా జయ జయధ్వనుల మధ్య అట్టహాసంగా శమీ దర్శనం జమ్మి చెట్టు వద్దకు తీసుకువచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు జరిపి జమ్మి ఆకును సేకరించి దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నిర్వాహకులు ఆదివారం అన్నదానం చేశారు. గడ్డిబజారు సత్యనారాయణస్వామి, రాజరాజేశ్వరీదేవి, బాల పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారికి పవళింపుసేవ జరిపారు.





నగరోత్సవానికి తరలిన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి



జనసంద్రం మధ్యన జగజ్జనని విజయదుర్గమ్మ (ఇన్‌సెట్) సింహ వాహనంపై విజయదుర్గాదేవి

ఉద్యోగులకు రూ.22వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్



మాట్లాడుతున్న కె.ఎస్.ఎస్.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు రూ.22వేల కోట్లు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడంలో జాప్యం తగదన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, అంతిమ చెల్లింపులు, సరెండర్ లీవ్, డీఏ, గత పీఆర్సీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నూతన పీఆర్సీ కమిషన్ వేయాలని, అది అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ వృత్యంతర శిక్షణ ఏ జిల్లా వారికి అక్కడే నిర్వహించాలని కోరారు. ఆరోగ్య సమస్యలున్న వారిని, 55 ఏళ్ల దాటిన వారికి శిక్షణ నుంచి మినహాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, క్రిష్టారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, షేక్ జాబీర్, జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతన సవరణకు కమిటీ ప్రకటించాలి

ఆర్‌జేయూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు



మాట్లాడుతున్న గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగుల నూతన వేతన సవరణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కమిటీని ప్రకటించాలని, రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్(ఆర్‌జేయూపీ) రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప భుజంగరావు టీచర్స్ హోంలో జరిగిన ఏపీ జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు నూతన పీఆర్‌సీ అమలు చేసే వరకు మధ్యంతర భృతి(ఐ.ఆర్) ఇవ్వాలన్నారు. సంఘం అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి మాట్లాడుతూ జీవో–117 ను రద్దు పరచి, ప్రాథమిక తరగతులను వేరుగా కొనసాగించాలని కోరారు. సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల డైట్, జేఎల్ తదితర పదోన్నతులకు మార్గం సుగమం చేయాలన్నారు. ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు డైట్, బీఎడ్ కళాశాలలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు రెడ్డెన్న, వీరయ్య, వీరన్న, రామకృష్ణా రెడ్డి, సుదర్శనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ద్రవ జీవామృతాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

వల్లూరు (చెన్నూరు) : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. చెన్నూరు మండలం కనపర్తి గ్రామానికి చెందిన రైతు దండు బోయిన బాలచంద్ర, బలసింగాయపల్లె గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న పసుపు పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిహోత్రంతో పాటు ద్రవ జీవామృతం, పండ్ల రసం ద్రావణం, బ్యాక్టీరియా కల్చర్, అనుజలం, పంచగవ్య, కవచ్, ఆవాల పిండి మరియు సైంధవ లవణం, సున్నం వంటి పదార్థాలను వాడాలని సూచించారు. ఈ వినూత్న వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు వస్తాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, అధికారులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవేతనం విడుదల చేయాలి

కడప కల్చరల్ : పాస్టర్లకు గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, వారిపై దాడులు జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కోరారు. ప్రపంచ పాస్టర్ల దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని కృపా కాలనీ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద పాస్టర్లను గుర్తించి రూ.5వేల గౌరవ వేతనం ఇవ్వగా, సూపర్ సిక్స్‌లో పొందుపరిచిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడం తగదన్నారు. క్రిస్టియన్ మైనార్టీ నిధులు, చర్చిల్లో ప్రహరీల మరమత్తులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

వీరపునాయునిపల్లె: మండలంలోని 22 పంచాయతీల్లో సోమవారం నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్ తెలిపారు. సోమవారం అలిదెన, పాయసంపల్లె, ఇందుకూరు, మంగళవారం ఉరుటూరు, యు. వెంకటాపురం, తలపనూరు, బుధవారం వెల్దుర్తి, బసిరెడ్డిపల్లె, కొమ్మద్ది, గురువారం గంగిరెడ్డిపల్లె, యరమలపల్లె, మిట్టపల్లె, శుక్రవారం బుసిరెడ్డిపల్లె, యన్. పాలగిరి, మొయిళ్లచెరువు, శనివారం వీరపునాయునిపల్లె, అనిమెల, గోనుమాకులపల్లె, సోమవారం యస్. పాలగిరి, యు. రాజుపాలెం, తంగెడుపల్లె గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

పోటా పోటీగా బండలాగుడు పోటీలు

అట్లూరు: మండల పరిధిలోని అట్లూరు క్రాస్‌రోడ్డులో వెలసిన అబ్బిరెడ్డి మఠం ఆరాధనోత్సవాలలో ఆదివారం ఎడ్ల బండ లాగుడు పోటీలు రసవత్తంగా సాగాయి. ఈ పోటీలలో ఆరు జతల ఎడ్లు పాల్గొనగా నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు మొదటి బహుమతి రూ.70 వేలను, కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్‌యాదవ్ ఎడ్లు రెండవ బహుమతి రూ.50 వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎడ్లు మూడవ బహుమతి రూ.30 వేలు సాధించాయి. గుంటూరు జిల్లా ఇనిమెట్ల ఎడ్లు నాల్గవ బహుమతి రూ. 20 వేలు గెలుచుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో కుమారిపూజ



బాలికల పాదాలు తలకు తాకించుకుంటున్న శ్రీ బ్రహ్మానందగిరిస్వామి

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ సమీపంలోని ఆచార్ల కాలనీలో వెలసిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని శనివారం కుమారిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాశీ నుంచి వచ్చిన శ్రీ బ్రహ్మానందగిరిస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 4 నుంచి 9 ఏళ్ల బాలికలను అమ్మవారి స్వరూపాలుగా భావించి ఈ పూజలో కూర్చోబెట్టారు. వారికి అమ్మవారి వేషధారణ వేయించారు. వారి కాళ్లను శ్రీ బ్రహ్మానందగిరిస్వామి కడిగి, పుష్పాలతో అర్చించారు. వారి కాళ్లు తలకు తాకించుకుని, దీపారాధన చేశారు. ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుని, ఆలోపించి చేసింది. ఈ సందర్భంగా శ్రీ బ్రహ్మానందగిరిస్వామి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై అత్యాచారాలు, హత్యాచారాలు పెరిగిపోయాయని తెలిపారు. చిన్నారులను కూడా కొందరు చెరపడుతున్న వార్తలు మనం చూస్తునే, వింటూనే ఉన్నామని పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు స్త్రీమూర్తిపై గౌరవ భావం పెంచడమే సరైన మార్గమని పేర్కొన్నారు. పురాణాలు, ఇతిహాసాల్లోనూ మహిళలకు ఉన్నతమైన స్థానం కల్పించారని చెప్పారు. స్త్రీలను గౌరవించడం ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగమన్నారు. ఈ మధ్యన ఈ విధానం కొంత గాడి తప్పిందన్నారు. మళ్లీ పునరుద్ధరించాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం సరైన అవగాహన కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. 4 నుంచి 9 ఏళ్ల బాలికలది అన్నెం పుణ్యం ఎరుగని వయసు కాబట్టి.. వారిని అమ్మవారిగా భావించి పూజ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కొందరైనా మారుతారని తాను ఆశిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి



పగడాల సిద్ధయ్య , మహబూబ్‌బాషాలను సన్మానిస్తున్న దూదేకుల ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలో దూదేకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలని ఏపీ నూర్‌బాషా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సిద్ధయ్య పేర్కొన్నారు. స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో దూదేకుల సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల వర్గంవారు ఐకమత్యంతో ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలమన్నారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రూప్–1, 2 పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఐఆర్‌ఎస్ సాధించిన శామీర్‌రాజాను పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగూర్, నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహ్మద్, ప్రధాన కార్యదర్శి సలీం, కోశాధికారి దస్తగిరి, నాయకులు డాక్టర్ బాబర్, నూర్ మహ్మద్, లాల్ నజీర్, ఖాదర్‌బాషా, రాజ కిశోర్‌బాబు, చిన్న హుస్సేన్ షేక్షావలి, మహబూబ్‌బాషా, హుసేన్, నాగరాజు, డాక్టర్ ఉమర్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. వెంకటయ్యనగర్‌కు చెందిన వెంకటేష్, మహేష్‌లు తమ ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు ఉంచి నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగడంతో పాటు పెట్రోలు ట్యాంకు పేలి పెద్ద శబ్దం రావడంతో బయటికి వచ్చి చూడగా ద్విచక్ర వాహనాలు దగ్ధమవుతున్నాయి. వెంటనే వాహనాల యజమానులు, స్థానికులు నీళ్ళు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై బాధితులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

పేరు గొప్ప.. తిలక్ నగర్ దిబ్బ


నగర శివారు ప్రాంతాల్లో సమస్యలు షికారు చేస్తున్నాయి. వెక్కిరిస్తున్న గుంతల రోడ్లు, దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న వీధి దీపాలు, దశా, దిశ లేని మురికి కాల్వలు, ఇలా ఒకటా, రెండా ఎన్నో సమస్యలు చుట్టుముట్టి స్థానికులను వేధిస్తున్నాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు లేక ప్రజలు అవస్థ పడుతున్నారు.

- స్తంభాలున్నా వెలగని వీధి దీపాలు
- సీసీ రోడ్ల జాడే లేదు, కాల్వలు లేవు
- శివారు కాలనీ తిలక్ నగర్ దుస్థితి ఇదీ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివారులోని తిలక్ నగర్ ప్రాంతంలో 300 ఇళ్లు ఉన్నాయి. 2వేల మంది నివాసం ఉంటున్నారు. నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కాలనీ వాసులను సమస్యలు వెంటాడుతున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో ఉండడంతో కుళాయి పన్ను, ఇంటిపన్ను, ఆస్తి పన్ను చెల్లిస్తున్నా.. తమ ప్రాంతాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. కాలనీలో మురుగు కాల్వలు లేవు. ఇప్పటి వరకూ సీసీ రహదారులు నిర్మించలేదు. దీంతో మురుగు నిలిచి రోడ్లపై జనం నడవడానికి ఇబ్బందిపడుతున్నారు. దీనికి తోడు గోతులు పడడంతో వర్షాకాలంలో నీరు నిలిచి నడిచేందుకు కష్టమవుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. స్తంభాలకు వీధి దీపాలు ఉన్నా ఏ ఒక్కటీ వెలగడం లేదు. సాయంత్రం అయితే కాలనీలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లే వారంతా ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తమ కాలనీలో సీసీదారులు నిర్మించాలని, వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని, రోజూ తాగునీరు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



తిలక్ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు



అస్తవ్యస్తంగా ఉన్న మట్టిరోడ్డు

మంచి నీటికి కటకట!



కాలనీలో దాదాపు ఏడాదిగా తాగు నీరు రావడం లేదు. నీరు వదిలే వ్యక్తిని అడిగితే రోజు మార్చి రోజు వదులుతున్నానని చెబుతున్నారేగానీ ఏ రోజు మంచి నీరు రావడం లేదు. అధికారులు ఒకసారి మా కాలనీలో సమస్యలపై దృష్టి పెట్టాలి.

– మార్తమ్మ, తిలక్‌నగర్, కడప

వీధి దీపాలు పనిచేసేలా చూడాలి



మా కాలనీలో రాత్రిళ్లు విష పురుగులు సంచరిస్తున్నాయి. వీధి లైట్లు పని చేయలేదు. సాయంత్రం 7, 8 గంటలు దాటితే బయట తిరగాలంటే భయపడుతున్నాం. వీధి దీపాలు మరమ్మతు చేయించాలి.

– వెంకటసుబ్బయ్య, తిలక్‌నగర్, కడప

వర్షం వస్తే నరకమే



మా కాలనీలో రహదారులు నిర్మించలేదు. వర్షం వచ్చిందంటే నరక యాతన అనుభవిస్తున్నాం. అధికారులు స్పందించి మా ప్రాంతంలో సిమెంటు రోడ్లు వేయాలి. స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– వేల్పుల దానమ్మ, తిలక్‌నగర్, కడప

పట్టించుకునే వారే కరవయ్యారు



మా కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. అధికారులు పట్టించు కోవడం లేదు. రాత్రి పూట ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని జీవిస్తున్నాం. మా కాలనీపై దృష్టి సారించాలి.

– చెన్నమ్మ, తిలక్‌నగర్, కడప